క్లుప్తంగా

12 నుంచి వైకల్య పింఛన్ దారులకు వైద్యపరీక్షలు

చెరుకుపల్లి: మండలంలో కొందరు అర్హత లేకుండా వికలాంగ పింఛన్ పొందుతున్నారని, అటువంటి వారికి మరోమారు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో దృష్టి లోప పింఛన్‌దారులు 117 మందికి బాపట్ల ఏరియా హాస్పిటల్లో, వినికిడి లోప పింఛన్‌దారులు 297 మందికి తెనాలి ఏరియా హాస్పిటల్లో ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు జరుతాయని వివరించారు.

మినుము సాగులో సస్యరక్షణ తప్పనిసరి



రేపల్లె రూరల్: మినుము సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుడ్డికాయలంక, రేపల్లె పరిసర గ్రామాలలో బుధవారం మినుము పొలాలను ఆయన పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు. తెగుళ్ల నివారణ చర్యలు వివరించారు. ఈ-పంట నమోదు చేసుకోవాలని చెప్పారు.

ధర్మనిధికి విరాళాలివ్వండి



చెరుకుపల్లి: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మనిధికి విరాళాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఫౌండేషన్ జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ కోరారు. ధర్మనిధికి విరాళాల సేకరణ కార్యక్రమం బుధవారం రాజవోలు గ్రామంలో నిర్వహించారు. సమరసత సేవాఫౌండేషన్ జిల్లా పరియోజన ప్రముఖ్ పడమటి వెంకటేశ్వరరావు ధర్మనిధికి విరాళం అందించారు. ఫౌండేషన్ సభ్యులు రాజవోలు శ్రీజీవేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రచారకులు పరదామ కోటేశ్వరరావు, ఎండూరు సత్యనారాయణ, యరగళ్ళ వెంకటేశ్వరరావు, అబ్బూరి గణేష్ స్థానికులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

జీఎస్‌పాలెం(కర్లపాలెం): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన పిట్టలవానిపాలెం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గోకరాజు నల్లిబోయిన వారిపాలెంకు చెందిన డి.సాయి బాబు(60) తన ఇంటి వద్ద విద్యుత్ మోటార్ వేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై మరణించాడు. ఆయనకు భార్య ఉంది. సాయి బాబు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పునరుత్థాన పండుగల్లో పాల్గొనండి



తెనాలిఅర్బన్: హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8,9 తేదీల్లో 17వ పునరుత్థాన పండుగలు నిర్వహించనున్నట్లు బ్రదర్ సాల్మన్ తెలిపారు. అమరావతి ప్లాట్స్‌లో బుధవారం పండుగలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి ప్లాట్స్‌లోని స్టేడియం వద్ద ప్రతి రోజు మధ్యాహ్నం, రాత్రి కూడికలు జరుగుతాయని చెప్పారు. అనేక ప్రాంతాలలో దేవుని సేవలో బలంగా వాడబడుతున్న అనేక మంది దైవ సేవకులు వాక్య పరిచర్య చేసేందుకు వస్తున్నారని తెలిపారు.

9న హనుమాన్ చాలీసా పోటీలు

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీ శారద సంగీత ఆలయం సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు గొరావర్షుల ఆంజనేయశాస్త్రి నిర్వహణలో హనుమాన్ చాలీసా పోటీలను నిర్వహించనున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ, సత్యభామా సమేత గోవర్ధన స్వామి ఆలయం ప్రాంగణంలో ఈనెల 9వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. జూనియర్స్ (5-12 ఏళ్ల బాలబాలికలు), సీనియర్స్ (13-20 ఏళ్ల వయస్కులు) విభాగాలుగా నిర్వహించే ఈ పోటీల్లో రెండేసి విభాగాల్లోని విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3,000, ద్వితీయ బహుమతి రూ.2,000, తృతీయ బహుమతిగా రూ.1,000 అందజేస్తామన్నారు. మరో అయిదుగురికి కన్సొలేషన్ బహుమతులను అందజేస్తారు.

అపరాల సేద్యం.. ఆశాజనకం

- 3,850 హెక్టార్లలో మినుము సాగు
- 957 హెక్టార్లలో పెసర
- దిగుబడులు బాగున్నాయని రైతుల ఆనందం



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

చెరుకుపల్లి: ఈ ఏడాది రబీలో అపరాల సాగు ఆశాజనకంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్ వరి కోతలు పూర్తయిన తరువాత రైతులు మినుము, పెసర సాగు చేపట్టారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఎక్కువ శాతం మంది రైతులు వెద పద్ధతిలో మినుము, పెసర విత్తుకున్నారు. 3,850 హెక్టార్లలో మినుము, 957 హెక్టార్లలో పెసర పంటలను సాగు చేస్తున్నారు.

నాణ్యమైన విత్తనాల సేకరణ

మండలంలో వరికోత కోసిన వెంటనే రైతులు నాణ్యమైన విత్తనాలు సేకరించుకొని డిసెంబర్ నెలలోనే 20 రోజులు ముందుగానే వెద పద్ధతిలో విత్తుకున్నారు. దీంతో కొన్ని పైర్లు పూత పిందె దశలో, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అపరాల చేలన్నీ బాగున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్‌లో వచ్చిన తుఫాన్‌కు కొన్నిచోట్ల పూర్తిగా ముంపునకు గురైన వరి పొలాల్లో పంటను కోసేసి నవంబర్‌లోనే మినుము, పెసర పంటలను రైతులు సాగు చేశారు. ఇప్పుడు ఆ పొలాల్లో మినుము, పెసర దిగుబడులు బాగా వస్తున్నాయి. ఇవి ఆశాజనకంగా ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గుళ్ళపల్లిలో పూత, పిందె దశలో మినప చేను

ఎనిమిది ఎకరాల్లో సాగుచేశా

ఈ ఏడాది రబీలో ఎనిమిది ఎకరాల్లో మినుము సాగు చేశాను. అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. గతంలో ఏటా రైతు భరోసా నగదు వచ్చేది. ఈ సంవత్సరం అది లేదు. పెట్టుబడి సొంతంగా పెట్టుకోవల్సి వచ్చింది.

జజ్జురు శ్రీనివాసరావు రైతు గుళ్ళపల్లి

గిట్టుబాటు ధర కల్పించాలి



నేను ఒక ఎకరంలో మినుము సాగు చేస్తున్నాను. ఇప్పటి వరకు విత్తనాలు కొనుగోలు, మందులు పిచికారీకి రూ.15 వేలకుపైగా పెట్టుబడి అయింది. గత ప్రభుత్వంలో ధాన్యం పచ్చి వడ్లే రూ.2వేలకు కొనుగోలు చేశారు. ఇప్పుడు బస్తా రూ.1,400 మించట్లేదు. ఇంకా అపరాలకు రేటు ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మినుముకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– పిట్టు రామిరెడ్డి కౌలు రైతు పొన్నపల్లి

కయాకింగ్ కానోయింగ్ పోటీలలో గాయత్రికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన నాగిడి గాయత్రి

నగరం: ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడ పోటీలలో స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలకు చెందిన విద్యార్థిని నాగిడి గాయత్రి కయాకింగ్ కానోయింగ్ పోటీలలో గోల్డ్‌మెడల్ సాధించిందని కరస్పాండెంట్ వి.బుచ్చియ్యచౌదరి చెప్పారు. కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 28 నుంచి ఈనెల 14 వరకు జాతీయ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపోటీలలో భాగంగా తమ కళాశాలలో బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాగిడి గాయత్రి బుధవారం కయాకింగ్ కానోయింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరుపున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించిందని పేర్కొన్నారు. గాయత్రికి కళాశాల పాలకవర్గం అభినందనలు తెలిపింది. సమావేశంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబమూర్తి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

- టౌన్ ప్లానింగ్ అధికారులతో వ్యాపారులు వాగ్వివాదం
- కమిషనర్ జోక్యంతో ముగిసిన వివాదం



బుర్రిపాలెం రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

తెనాలిఅర్బన్: ఆక్రమణల తొలగింపులో వ్యాపారులకు మున్సిపల్ అధికారుల మధ్య వాగ్వివాదం జరిగింది. కమిషనర్ జోక్యంతో చివరకు ఆక్రమణలను తొలగించారు. వివరాలలోకి వెళ్తే... మున్సిపల్ మార్కెట్ వద్ద కొందరు వ్యాపారులు షాపుల బయట కూరగాయాలను విక్రయిస్తున్నారు. షాపులలోనే విక్రయాలు జరపాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గతంలో సూచించి వాటిని తొలగించారు. అయిన కొందరు వ్యాపారులు షాపుల బయట విక్రయాలు జరుపుతుండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్కడకు వెళ్ళి వాటిని తొలగించాలని ఆదేశించారు. దీంతో వ్యాపారులు టౌన్ ప్లానింగ్ సిబ్బందితో వాగ్వివాదంకు దిగారు. కమిషనర్ శేషన్న అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి ఆక్రమణలు తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారు. అలాగే బుర్రిపాలెం రోడ్డులో కూడా కొందరు వ్యాపారులు మురుగు కాల్వలపై మెట్లు నిర్మించటంతో వాటిని జేసీబీతో తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ టి.శివన్నారాయణ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, పలువురు బిల్డింగ్ ఇన్స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

వ్యవ'సాయం'లేని కేంద్రం బడ్జెట్ ప్రతుల దహనం



అయితానగర్‌లో బడ్జెట్ ప్రతుల దగ్ధం

తెనాలి: నూటికి 70 శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగంపై కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో కేవలం 2.51 శాతం నిధులు కేటాయించటాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అయితానగర్, రూరల్ మండల గ్రామం గుడివాడ సెంటర్లోనూ బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. బడ్జెట్లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఎనిమిదేళ్లలో లక్షా 474 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడినట్టు చెప్పారు. పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని ఆందోళన చేసినాగానీ బడ్జెట్‌లో దాని ఊసే లేకపోవడం దుర్మార్గమన్నారు. ఎరువుల సబ్సిడీలో రూ.3,412 కోట్లు కోత విధించినందున వాటి ధరలు పెరుగుతాయని చెప్పారు. ఇన్నేళ్ల మోదీ పరిపాలనలో రాష్ట్రానికి ఏం ఒరిగిందో చెప్పాలని నిలదీశారు. పాలరైతుల సంఘం జిల్లా నాయకురాలు వేజెండ్ల తబిత, అత్తోట సరోజిని, తెనాలి మేరిమ్మ, కూచిపూడి శకుంతల, జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, తెనాలి ఝాన్సీ, లంకా రత్నం, మేకల మరియదాసు, వేజండ్ల నాగేశ్వరరావు, తెనాలి శాంతకుమారి, కొలకలూరి జార్జి, కడియాల ప్రవీణ్, బండికళ్ల సమాధానరావు పాల్గొన్నారు.

మైనర్ బాలికతో అసభ్య ప్రవర్తన

యువకుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఓ మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళగిరి రూరల్ పరిధిలోని యర్రబాలేనికి చెందిన బాలిక డాన్‌బాస్కో స్కూల్‌లో చదువుతోంది. ఈ నెల ఒకటిన సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆ బాలికను వెంబడించి అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పడంతో ఒకటో తేదీ రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా, ఇతర సాక్ష్యాల ఆధారంగా నిందితుడు యర్రబాలేనికి చెందిన వెంకట్‌గా గుర్తించామని సీఐ తెలిపారు. అతను ఎయిమ్స్ హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్‌లో అసిస్టెంట్‌గా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించి, మంగళగిరి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. నిందితుడిని జిల్లా జైలుకు తరలించామని తెలిపారు.సమావేశంలో యస్ఐ సీహెచ్. వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పొలాల్లో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కోపల్లె-గుడివాడ గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్, సిబ్బంది బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 5200 స్వాధీనం చేసుకున్నారు.

టీబీ అంతం-మనందరి పంతం కావాలి



తెనాలిఅర్బన్: టీబీ అంతం--మనందరి పంతం కావాలని టీబీ యూనిట్ తెనాలి సూపర్‌వైజర్ పి రవికుమార్ పేర్కొన్నారు. అంగలకుదురులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్షయ వ్యాధిపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటు వ్యాధి అని గాలి ద్వారా వ్యాపించే అవకాశం ఉన్నందున అందరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం వస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. సమావేశంలో హెచ్ ఎం అనురాధ, సిబ్బంది సౌజన్య, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధృవపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్య శాలలో ప్రతివారం నిర్వహిస్తున్న ప్రత్యేక సదరం క్యాంప్ బుధవారం కొనసాగింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సదరం క్యాంప్‌ను అధికారులు నిర్వహించారు. ఈఎన్‌టీ, అప్తామాలజీతో పాటు ఈవారం నుంచి సైక్రాటిక్ విభాగ సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఈఎన్‌టీ విభాగంలో 50 మందిని, అప్తామాలజీ విభాగంలో 44 మంది, సైక్రాటిక్ విభాగంలో 20 మందికి వైద్య పరీక్షలు చేశారు.

15లోపు ఈ-పంట నమోదు చేయించుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో సుమంత్‌కుమార్

కర్లపాలెం: రబీ సీజన్‌కు పంటలు సాగు చేస్తున్న రైతులు ఈనెల 15లోపు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుమంత్ కుమార్ చెప్పారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కర్లపాలెం మండలంలోని దుండివారిపాలెం, ఏట్రవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఏవో సుమంత్‌కుమార్ మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ కూడా చేయించుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేసే సబ్సిడీ పథకాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. సబ్సిడీ పథకాలకు అర్హులైన రైతులకు ప్రభుత్వం యూనిక్ ఐడీ కల్పిస్తుందని, దీనికోసం రైతులు తమ ఆధార్, 1బీ జిరాక్స్‌లతో పాటు మొబైల్ నంబరు గ్రామ వ్యవసాయ సహాయకులకు ఇవ్వాలని చెప్పారు. కలుపు నివారణ సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈవో భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు సునీత, భ్రమరాంబ, రైతులు పాల్గొన్నారు.

మద్యం షాపుల కోసం గీత కార్మికుల దరఖాస్తుకు గడువు పెంపు

నగరం/రేపల్లె రూరల్: కల్లు గీత కులాలకు కేటాయించిన మద్యం షాపుల కోసం దరఖాస్తుకు గడువు పెంచినట్లు నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్, రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపారు. బుధవారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే వారికి తొలుత ఈనెల 5వరకు సమయం ఇచ్చారని, దీనిని మరో మూడు రోజులు పెంచినట్టు వెల్లడించారు. ఈనెల 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తుకు నాన్ రిఫండబుల్ ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. లైసెన్స్ ఫీజు 2024-25 సంవత్సరానికి రూ.21,66,667, 2025-26 సంవత్సరానికి 35,75,000గా నిర్ణయించినట్టు వివరించారు. ఈనెల 10న బాపట్ల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో లాటరీ తీయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అందించవచ్చునన్నారు. నగరం, రేపల్లె రూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలోనూ దరఖాస్తులు అందజేయవచ్చునని వెల్లడించారు.

దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



సుబ్రమణ్యం దంపతులను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

బాపట్లటౌన్: దాతల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని పాఠశాల హెచ్‌ఎం వై.సత్యవతి తెలిపారు. పట్టణంలోని ఏవీవీ ఉన్నత పాఠశాలకు బుధవారం పాఠశాల పూర్వ విద్యార్థి జి.ప్రకాష్, ఉద్యోగ విరమణ చేయబోయే కె.కళ్యాణి, ఐ.శ్రీనివాసరావు సహకారంతో పాఠశాలకు స్టీలు బల్లలు, స్టీల్ మెస్‌లు సమకూర్చినట్టు వివరించారు. అనంతరం ప్రకాష్ తల్లిదండ్రులైన సుబ్రమణ్యం, సత్యవతి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ కె.గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ బి.హరినాథమురళి, కరస్పాండెంట్ పి.రఘురాం, జాయింట్ సెక్రటరీ ఎస్.మురళీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తే సహించేది లేదు



బస్టాండ్ సెంటరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నేతలు

రేపల్లె రూరల్: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ బుధవారం సాయంత్రం సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటరులో నిరసన వ్యక్తం చేశారు. లేబర్‌కోడ్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మణిలాల్ లేబర్ కోడ్‌తో శ్రామికులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన చెందారు. లేబర్ కోడ్ రద్దు చేయకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మంజుధర్, నాయకులు కృష్ణకుమారి, రత్నకుమారి, మేరీమణి, ప్రభాకర్, నరేష్, శ్రీనివాసరావు, రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరాహాల స్వైరవిహారం



రేపల్లె ఉప్పూడి రోడ్డులో చెత్త కుప్పలలో ఇలా..



మోంట్‌ఫోర్ట్ స్కూలు రోడ్డులో ఇదీ దుస్థితి

రేపల్లె పట్టణంలో వరాహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. అపరిశుభ్రత సృష్టిస్తున్నాయి. ప్రధాన రోడ్లలోనే చెత్తాచెదారంలో చేరుతున్నాయి. వాహనాలకు అడ్డుపడుతున్నాయి. పందుల సంచారం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు స్పందిస్తూ.. పందుల నియంత్రణకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పెంపకందారులకు నోటీసులు జారీ చేశామని, వారు పట్టించుకోని పక్షంలో పందులను ప్రత్యేక వాహనాల్లో వేరే ప్రాంతాలకు తరలిస్తామని పేర్కొన్నారు. – రేపల్లె రూరల్

తెనాలి వాసి ప్రజ్ఞానంద సరస్వతికి పీఠాధిపత్యం



శ్రీసాలిగ్రామం ట్రస్ట్ బాధ్యులతో

తెనాలి: ఆర్యవైశ్య కులదేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మస్థలమైన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని అఖిలభారత శ్రీ వాసవీ పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) పీఠాధిపత్యం స్వీకరించనున్నారు. ఈనెల 6,7,8 తేదీల్లో పీఠాధిరోహణ, పట్టాభిషేక మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. పెనుగొండ క్షేత్ర వాసవీ శాంతిధామంలో 8వ తేదీన భీష్మ ఏకాదశి రోజున ఉదయం 11.27 గంటలకు పీఠాధిరోహణ మహోత్సవం, అనంతరం అనుగ్రహ భాషణ ఉంటాయి. ఈ సందర్భంగా తెనాలికి చెందిన శ్రీప్రజ్ఞానంద సరస్వతి పరిచయమిది. పట్టణంలోని శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ మఠం స్థాపకులు శ్రీప్రజ్ఞానంద సరస్వతి స్వామి. ఇక్కడే స్వామి ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమైంది. తమ బాల్యంలోనే ఆధ్యాత్మికతపై ఎంతో అవగాహన పొందారు. చిన్నతనంలోనే సన్యాస దీక్ష పొందిన కారణంగా భక్తులు, సన్నిహితులు బాలస్వామీజీగా పిలుచుకుంటారు. పట్టణంలోని బొలిశెట్టి నరసింహారావు, రాజ్యలక్ష్మి దంపతులకు 1989 అక్టోబరు 27న తృతీయ సంతానంగా జన్మించారు. అప్పట్లో తల్లిదండ్రులు పెట్టిన పేరు బొలిశెట్టి వెంకట ప్రదీప్ శ్రేష్టి. స్థానిక తాలూకా హైస్కూలులో పదోతరగతి వరకు చదివినా, శ్రీవిద్యాపీఠంలో ఎనిమిదేళ్ల వయసు నుంచే ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమైంది. వేదాలు, పురాణాలు, భగవద్గీత సహా పురాణేతిహాసాలను అభ్యసించారు. ఆధ్యాత్మిక చింతనలో విశేషంగా ఆధ్యాత్మిక యోగసాధన చేసి సిద్ధి పొంది ఉన్నారు. పవిత్ర పుణ్యస్థలమైన నైమిశారణ్యంలో శ్రీ ఆనందానంద సరస్వతి స్వామీజీ చేతులమీదుగా అయిదేళ్ల క్రితం సన్యాసదీక్ష స్వీకరించారు. స్వామీజీ పలు పుణ్యక్షేత్రాల్లో భక్తులకు అద్వైత బోధ, శంకర భాష్యం, ఉపనిషత్తుల సారాంశాలను తమ ప్రవచనాలతో తెలియజేస్తున్నారు. తెనాలిలోని శ్రీవిద్యా పీఠం, శ్రీసాలిగ్రామ మఠం, లలిత సేవాసమితి, జయలక్ష్మి మాతృమండలి వీరికి వేదికలుగా ఉన్నాయి. తెనాలి బుర్రిపాలెం రోడ్డులో శ్రీసరస్వతీ దేవాలయ నిర్మాణ సన్నాహాల్లో ఉన్నారు. మరోవైపు భారీ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో పేరుగాంచారు. ఈ నేపథ్యంలో 16 ఏళ్ల క్రితం ప్రారంభించిన పెనుగొండ పీఠానికి ప్రథమ పీఠాధిపతులుగా శ్రీకృష్ణానందపురి స్వామీజీ వ్యవహరించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: మద్యానికి డబ్బులివ్వలేదని వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ నాజరుపేటకు చెందిన గొంది బసవయ్య అద్దెకు ఆటోలను తిప్పుతుంటాడు. ఇతని వద్ద అంగలకు దురుకు చెందిన అనిల్ ఆటోలు అద్దెకు తీసుకుంటుంటాడు. అనిల్‌తో పాటు ఇస్లాంపేటకు చెందిన జూపల్లి వేణు, అతని స్నేహితుడు రాము గత నెల 31వ తేదీ రాత్రి మద్యం తాగడానికి బసవయ్యను డబ్బు అడుగగా అతను ఇచ్చేందుకు నిరాకరించాడు. వేణు బసవయ్య గొంతుపై కత్తితో పొడిచాడు. బాధితుడి ఫిర్యా దు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరు నిందితులపై చర్యలు తీసుకోవాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కొల్లిపర: మండల పరిధిలోని దంతలూరులో మరియమ్మ మహిళ ఇంటి వెనుక సుమారు 9 క్వింటాళ్ల 61 కేజీల రేషన్ బియ్యం బుధవారం గుర్తించినట్లు తహసీల్దారు జి.సిద్ధార్థ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మరియమ్మ ఇచ్చిన సమాచారం మేరకు బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.